


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఎన్నికల సమయంలో ప్రజలందరికీ ఇచ్చిన హామీలను అధికార పగ్గాలు చేపట్టిన కొద్ది గంటల వ్యవధిలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేర్చడం ఆరంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది నిరుద్యోగ యువత ఎన్నాళ్ళగానో ఆశిస్తున్న, ఎదురు చూస్తున్న మెగా డీఎస్సీ నిర్వహణకు తొలి సంతకం పడింది. వైసీపీ హయాంలో జనం భూములపై కన్నేసి చట్టం తీసుకొచ్చి మాయం చేద్దామనుకున్న మోసగాళ్ళకు చెక్ పెడుతూ టైటలింగ్ యాక్ట్‌ను రద్దు చేశారు. పేద వర్గాలకు పింఛన్ నాలుగు వేలకు పెంచుతూ మరో సంతకం చేశారు. పేదోడి కడుపు నింపేలా అన్న క్యాంటీన్లు పునః ప్రారంభానికి వీలు కల్పిస్తూ ఒక సంతకం, స్కిల్ సైన్సెస్ పేరిట యువతలో డవలప్‌మెంట్‌కు వీలుగా మరో సంతకం పూరించారు. ఇవన్నీ కూటమి ప్రభుత్వంపై జనామోదానికి దారితీశాయి.



భీమవరం పాత బస్టాండ్ సమీపంలో ఉన్న అన్నక్యాంటీన్



నరసాపురంలో పోలీస్‌స్టేషన్‌గా మారిన క్యాంటీన్

పాంచ్ పటాకా

మాట నిలుపుకున్న సీఎం చంద్రబాబు

- మెగా డీఎస్సీపై తొలి సంతకం
- నిరుద్యోగుల్లో కొండంత ఆశలు
- ఉమ్మడి జిల్లాలో సుమారు 1,600 పోస్టులు
- పేదలకు పింఛన్ మిఠాయిలు
- అన్న క్యాంటీన్లతో పేదోడికి ఆనందం
- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుతో జనామోదం
- జగన్ ఫొటో లేని పట్టాదారు పాసు పుస్తకాలు

ఇక పింఛన్ రూ.4 వేలు



భీమవరం ఎడ్యుకేషన్/తాడేపల్లిగూడెం రూరల్/పాలకొల్లు, జూన్ 13 : కూటమి సర్కార్ మాట నిలబెట్టుకుంది. చంద్రబాబు చెప్పింది చెప్పినట్టు చేశారు. తమకు అధికారం వచ్చిన నాటి నుంచి కాదు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన ఏప్రిల్ నెల నుంచే ఈ పెంచిన పింఛన్ ఇచ్చేందుకు ముందడుగు వేశారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేపట్టిన తొలి రోజే అవ్వా తాతలకు, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు ఆనందాన్ని రెట్టింపు చేస్తూ సంతకం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పింఛన్ అందుకుంటున్న లక్షా 98 వేల వృద్ధులు, ఒంటరి మహిళలతో పాటు 35 వేల మంది దివ్యాంగులు పెంచిన పింఛన్ కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో పింఛన్ అందుకుంటున్న 2 లక్షల 34 వేల మందికి ప్రతీ నెల రూ.100 కోట్ల అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. వృద్ధులు, ఒంటరి మహిళలకు రూ.4 వేలు చొప్పున 79 కోట్ల 20 లక్షలు ఇవ్వాల్సి ఉండగా, దివ్యాంగులకు రూ.6 వేలు చొప్పున రూ.21 కోట్లు అందించాల్సి ఉంది. ఈ లెక్కన ప్రతీ నెల రూ.98 కోట్ల రూపాయలు పింఛన్ రూపంలో అందించాల్సి ఉంటుంది. కూటమి అధికారంలోకి వస్తే ఏప్రిల్ నెల నుంచి పెంచిన పింఛన్ ఇస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు అన్నట్టుగానే ఏప్రిల్ నెల నుంచే అందించనున్నారు. అంటే వృద్ధులకు జూన్ నెలలో పెంచిన రూ.4వేలతో పాటు ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలకు మూడు వేలతో కలిసి రూ.7 వేలు అందించనున్నారు. దివ్యాంగులు అయితే పెంచిన పింఛన్ రూ.6 వేలు, మూడు నెలలకు రూ.3 వేలు చొప్పున రూ.15 వేలు జూలైలో అందుకోనున్నారు.

డీఎస్సీ రెడీ..

నిరుద్యోగ యువతకు మాట ఇచ్చినట్లుగానే కూటమి ప్రభుత్వం డీఎస్సీతో తొలి అడుగు వేసింది. మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొలి సంతకం చేయడంతో బీఈడీ, డీఎడ్ పూర్తయిన అభ్యర్థుల ఉద్యోగ అవకాశాలకు బాట వేసినట్లయ్యింది. ఉమ్మడి జిల్లాలో సుమారు 1600 పోస్టులు వరకు డీఎస్సీ ద్వారా భర్తీకి అవకాశం ఉంది. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో డీఎస్సీ ఊసే లేకపోవడంతో డీఎడ్,బీఈడీ పూర్తయిన వారు ఆశలు వదులుకున్నారు. కోచింగ్ సెంటర్లు అయితే జిల్లాలో 40కి పైగా ఉండేవి. డీఎస్సీతో పాటు ఇతర నోటిఫికేషన్‌లు కూడా లేకపోవడంతో కోచింగ్ సెంటర్లు మూతబడ్డాయి. దీంతో నిరుద్యోగ యువతకు గడిచిన ఐదేళ్లలో గడ్డు కాలమే నడిచింది. వైసీపీ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ అని పోస్టులు భర్తీ చేస్తామని హడావుడి చేసినా జాబ్ క్యాలెండర్‌ని అమలు చేయకపోవడం, నిరుద్యోగ యువత వలసపోయిన సంఘటనలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం ఎన్నికల కోడ్ అమలయ్యాక హడావుడిగా డీఎస్సీ నోటిఫికేషన్, టెట్,డీఎస్సీ తేదీలు ఖరారు చేసింది. అయితే డీఎస్సీ పరీక్ష కాల వ్యవధి ఎక్కువ ఉండాలని తేదీని మార్పు చేయాలని కోర్టు సూచించింది. వైసీపీ ప్రభుత్వం తమను మోసం చేసిందని అభ్యర్థుల నుంచి విమర్శలొచ్చాయి.

ఇక మన ఆస్తులు మన దగ్గరే

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండవ సంతకం చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతున్నది. ఇక మన ఆస్తులు మన దగ్గరే అని సంబరాలు చేసుకుంటున్నారు. వంద గజాల జాగా ఉన్న సామాన్య జనం నుంచి భూస్వాముల వరకూ ఊపిరి పీల్చుకున్నారు. గత ఐదేళ్ల పాలనలో జారీ చేసిన రెండు పట్టాదారు పుస్తకాలపై జగన్ ఫొటో తొలగించి నూతనంగా పుస్తకాలు ఇచ్చే పక్రియ ప్రారంభమవుతుందని రైతులు ఆశిస్తున్నారు. స్థిరాస్తులు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వాస్తవ డాక్యుమెంట్లు ప్రభుత్వం వద్దే ఉంచుకుని కేవలం నకలు (జిరాక్సులు) మాత్రమే కొనుగోలుదారులకు ఇచ్చేవిధంగా రూపొందించిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుతో కొనుగోలు దారులు హర్షం తెలుపుతున్నారు. జిల్లాలో సుమారు రూ.4 లక్షల హెక్టార్లులో వివిధ వ్యవసాయ పంటలు సాగవుతున్నాయి. మొత్తం విస్తీర్ణానికి సంబంధించి ఇప్పటికే జిల్లాలో 2.25 లక్షల పట్టాదారు పుస్తకాలు మంజూరు చేశారు. ఇందులో జగన్ ఫొటోతో 25 వేల పాస్ పుస్తకాలు మంజూరయ్యాయి. జగన్ ఫొటో తొలగించి నూతనంగా పాస్ పుస్తకాలు ఇచ్చే పక్రియ మొదలవుతుందని చెబుతున్నారు. వాస్తవంగా రైతు పట్టాదారు పాసుపుస్తకాలపై కవర్ పేజీపై రైతు ఫొటో రెండో లోపలి పేజీలలో రైతుకు చెందిన భూమి వివరాలు నమోదై ఉంటాయి. మా ఆస్తులకు సంబంధించిన పుస్తకాలపై జగన్ ఫొటో ఏమిటని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. భూ వివాదాలు పరిష్కరించుకోవడానికి కోర్టుకు వెళ్లే అవకాశాన్ని కోల్పోవడమే కాకుండా కేవలం ప్రభుత్వం అప్పిలేట్ అధికారి వద్దే వివాదాలు పరిష్కం చుకోవాలని ఈ యాక్టులో ఉండటం పట్ల అన్ని వర్గాలు తీవ్ర ఆందోళన చెందాయి. ఒక రకంగా ఈ చట్టమే జగన్ రాజకీయ పతనానికి కారణమైందని విశ్లేషకులు చెబుతున్నారు.



కూటమికి ఓటేసి మా భూములను కాపాడుకున్నాం



ల్యాండ్ టైట్లింగ్ యాక్టును చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేయడం హర్షనీయం. నేను ఒక రైతుని. గత ప్రభుత్వం అమలు చేయాలని చూసిన ఈ యాక్టు గురించి ఎన్నికల ప్రచార సభల్లో తెలుగుదేశం పార్టీ అందరికీ అర్థమయ్యేలా ప్రచారం చేసింది. దీంతో మేము ఎన్డీయే కూటమికి ఓటేసి మా భూములను కాపాడుకున్నాం.

-తాడి ముసలయ్య, రైతు, గొల్లవాని చెర్వు

రియల్ ఎస్టేట్ రంగానికి మంచి రోజులు



గత ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ రంగం అగమ్యగోచరంగా తయారైంది. వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టుతో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా అధోగతి పాలైంది. ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ యాక్టును రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు సంతకం చేయడం రియల్ ఎస్టేట్ రంగానికి మళ్లీ మంచి రోజులు వస్తాయని భావిస్తున్నాం.

- మిరియాల నాని, రియల్టర్, నాగరాజు పేట

ఆత్మ విశ్వాసం పెరిగింది



గత ప్రభుత్వం మాకు ఇస్తామన్న పింఛన్ సొమ్ము ఏడాదికి కొంత చొప్పున పెంచుతూ ఇచ్చారు. కానీ చంద్రబాబు సారథ్యంలో అధికారంలోకి చేపట్టగానే చెప్పింది చెప్పినట్టు చేసేందుకు సిద్ధమవడం ఎంతో ఆనందం. మాలాంటి దివ్యాంగులకు ఈ పింఛన్ ఎంతో ఆత్మవిశ్వాసాన్ని అందిస్తుంది.

- కొమ్మా ధనలక్ష్మి, నందమూరు

ఆనందం రెట్టింపు



పింఛన్ సొమ్ముపైనే ఆధారపడి జీవిస్తున్నాం. మాకు గతంలో కూడా ఒకేసారి రూ.2 వేలు పింఛన్ ఇచ్చి ఆదుకున్న చంద్రన్న ఇప్పుడు దాన్ని రెట్టింపు చేసి రూ.4 వేలు ఇవ్వడం మా ఆనందం రెట్టింపయింది. ఆయన మాకు దేవుడితో సమానం.

-బండి నరసమ్మ, తాడేపల్లిగూడెం

నిరుద్యోగులకు వరం



ఎన్నో ఏళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నాను. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకుండా చివరిలో మోసపూరిత నోటిఫికేషన్ ఇచ్చారు. ఇప్పుడు డీఎస్సీ మీద తొలి సంతకం పెట్టడం ఆనందంగా ఉంది. ఉద్యోగం పొందేందుకు ఇది వరం లాంటిది.

- ఉదయ భాస్కరి, భీమవరం

అన్న క్యాంటీన్‌తో కడుపు నింపుకున్నాం



గతంలో రూ.5లకే నాణ్యమైన భోజనం చేశాం. తద్వారా ఎంతో ఆనందించాం. వైసీపీ ప్రభుత్వం పూర్తిగా క్యాంటీన్‌లు మూసివేసి మా పొట్టకొట్టారు. ఆ సమయంలో కడుపునింపేందుకు నానా అవస్థలు పడ్డాం. టీడీపీ రాకతో క్యాంటీన్‌లు పూర్వవైభవం వస్తుంది. మా కడుపు నిండుతోంది.

- పెద్దింటి పాపారావు, ఏలూరు

పేదోడి కడుపు నిండుగా

అన్న క్యాంటీన్లు పునరుద్ధరణ

భీమవరం టౌన్/ తాడేపల్లిగూడెం అర్బన్/తణుకు/ నరసా పురం జూన్ 13 : పేద వారి కోసం రూ.5లకే టిఫిన్, భోజనం అందించేందుకు గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌లను పునరుద్ధరిస్తూ సీఎం చంద్రబాబు సంతకం చేశారు. దీనిపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ క్యాంటీన్లపై జగన్ ప్రభుత్వం కన్నెర్ర చేసి మూసివేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. కొద్దిరోజులకు వాటిలో చాలా వాటిని సచివాలయాలుగా మార్చారు. కొన్నిచోట్ల నిరుపయోగంగా ఉన్నాయి. జిల్లాలో భీమవరం, తాడేపల్లి గూడెం, తణుకు, భీమవరం, నరసాపురం, పాలకొల్లు పట్టణాల్లో అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటిలో సచివాలయాలు, పోలీస్ స్టేషన్‌లను ఏర్పాటు చేసింది. కొన్నిచోట్ల తెలుగుదేశం నాయకులే ఉచిత భోజనాలు ఏర్పాటు చేశారు. పాలకొల్లులో అన్న క్యాంటిన్ వద్దనే ప్రతీ రోజు భోజనాలను అందించారు. తాడేపల్లిగూడెం, తణుకులోను దాతల సహకారంతో అన్న క్యాంటిన్‌లు నిర్వహిస్తూ వచ్చారు. రోజువారీ కూలీలు, పేద కార్మికులే కాకుండా పట్టణాలకు వివిధ పనులపై వచ్చిన వారికి ఈ అన్న క్యాంటీన్లు ఆకలి తీర్చేవి. తాడేపల్లిగూడెంలో రద్దీ ఎక్కువ ఉన్న ప్రదేశాలైన తాలూకా సెంటర్ వద్ద, మున్సిపల్ కార్యాలయం వద్ద, బైపాస్ రహదారి వద్ద అన్న క్యాంటీన్లు నిర్వహించేవారు. పట్టణంలో అన్న క్యాంటీన్ల భవనాలు నేడు వార్డు సచివాలయాలకు నిలయాలుగా మారిపోయాయి. తాలూకా సెంటర్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్ భవనం లో 33 వ వార్డు సచివాలయం, మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న అన్నా క్యాంటిన్ 8 వార్డు సచివాలయం, బైపాస్ రోడ్డు వద్ద ఉన్న అన్నా క్యాంటిన్ 14, 17 వార్డుల సచివాలయాలుగా మారిపోయాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో మరుగునపడ్డ అన్న క్యాంటీన్ పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్‌ను క్లీన్ చేశారు. చెత్త మొక్కలను తొలగించారు. క్యాంటీన్ ప్రారంభించేందుకు వీలుగా రెడీ చేస్తున్నారు. నరసాపురంలో అన్న క్యాంటీన్ వైసీపీ నిర్వాకం వల్ల నేడు పోలీస్‌స్టేషన్‌గా మారింది. రాష్ట్ర విభజన తరువాత ఎన్నో హంగులతో పట్టణంలోని స్టీమర్‌రోడ్‌లో రూ.20 లక్షలతో దీన్ని నిర్మించారు. అన్న క్యాంటీన్ డిజైన్‌ను మొత్తం ధ్వంసం చేసి రూరల్ సర్కిల్ కార్యాలయంగా మార్చేశారు. మూడేళ్ళ నుంచి ఈ భవనం పోలీస్ శాఖ అదీనంలో ఉంటుంది. భీమవరంలోని మూడు క్యాంటీన్లు సచివాలయాలుగా మారిపోయాయి. టూటౌన్ అడ్డవంతెన వద్ద, పాత బస్ స్టాండ్ వద్ద, బుధవారం మార్కెట్ లోని మునిసిపల్ కాంప్లెక్స్ వెనుక భాగంలో అప్పట్లో క్యాంటీన్‌లు ఏర్పాటు చేశారు. అడ్డవంతెన దగ్గర ఉన్న అన్న క్యాంటీన్‌ను 35వ వార్డు సచివాలయంగా, పాత బస్‌స్టాండ్ వద్ద ఉన్న క్యాంటీన్‌లోకి 34వ వార్డు సచివాలయాన్ని, బుధవారం మార్కెట్ వద్ద ఉన్న క్యాంటీన్‌లోకి 8వ వార్డు సచివాలయాన్ని మార్చేశారు.

వేటకు వేళాయె

- నేటి అర్ధరాత్రి నుంచి సముద్రంలో వేటకు పచ్చజెండా
- తీరానికి చేరుకుంటున్న బోట్లు
- 60 రోజుల తరువాత మళ్లీ సందడి



నరసాపురం, జూన్ 13: తీర ప్రాంతంలో వేట నిషేధ ఆజ్ఞలు ఎత్తివేయనున్నారు. ఏప్రిల్ 15 నుంచి సుమారు 60 రోజుల పాటు విధించిన నిషేధ ఉత్తర్వులు శుక్రవారం అర్ధరాత్రి నుంచి రద్దు కానున్నాయి. దీంతో తీరానికి బోట్లు చేరుకుంటున్నాయి. రెండు నెలల పాటు వృత్తికి దూరంగా ఉన్న మత్స్యకారులు వలల్ని, ఇతర సామాగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు ఈ రంగంపై ప్రత్యేకంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్న సుమారు 2 వేల మందికి మళ్లీ ఉపాధి చిక్కనుంది. మత్స్య సంపద ఎగుమతి వల్ల నెలకు రూ.50 కోట్లుపైనే ఉభయగోదావరి జిల్లాల్లో వ్యాపారం జరుగుతుంది. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో సముద్రంలో మత్స్య సంపద పునరుత్పత్తి జరుగుతుంటుంది. ఈ సమయంలో వేట సాగిస్తే సంపద హరించిపోతుందన్న ఉద్దేశంతో దేశ వ్యాప్తంగా 60 రోజుల పాటు కేంద్రం నిషేదం విధిస్తుంది. దానిలో భాగంగా నరసాపురం, మొగల్తూరు మండలాల్లో రెండు నెలల పాటు వేట నిలిచిపోయింది. ఈ కారణంగా 1,750 మంది మత్స్యకారులు ఉపాధి కోలోయారు. ఈ రంగంపై ఆధారపడి పని చేసే ఐస్ ఫ్యాక్టరీ కార్మికులు, లారీ డ్రైవర్లు, ఎగుమతి షెడ్ల్లో పనిచేసే కూలీలకు కూడా పని లేకుండా పోయింది. సముద్ర మత్స్య సంపద లేకపోవడంతో చేపల మార్కెట్‌లు వెలవెల బోయాయి. రోజుకు రూ. 2 కోట్లుపైనే ఎగుమతులు ఆగిపోయాయి. నిషేధ ఆజ్ఞలు ఎత్తివేయడంతో మళ్లీ సందడి మొదలైంది. ఇప్పటికే తీర ప్రాంతంలో వేట సాగించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి బోట్లు నరసాపురం తీరానికి చేరుకుంటున్నాయి. గోదావరిలో సముద్రం కలిసే ప్రదేశం కావడంతో ఈ ప్రాంతంలో అపార మత్స్య సంపద దొరుకుతుంది. విదేశీ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న సందువాయి, టోనా, పండుగొప్ప వంటి చేపలు ఇక్కడ పుష్కలంగా దొరుకుతాయి. నెల్లూరు, చీరాల, మచిలీపట్నం తదితర ప్రాంతాల నుంచి ఇక్కడ వేటాడేందుకు వస్తుంటారు. ఈ ఏడాది వేట అనుకూలంగా ఉంటుందని కోటి ఆశలు పెట్టుకుంటున్నారు. ఇప్పటికే వాతావరణం అను కూలించడంతో వేటకు రెడీ అవుతున్నారు. వరదలు కూడా కలిసివస్తే చప్పనీరుకు ఎదురొచ్చే కొన్ని రకాల మత్స్య సంపద పుష్కలంగా దొరుకుతుందని ఆశతో ఉన్నారు. అయితే ప్రభుత్వం వీరికి ఇవాల్సిన నిషేధభృతి రూ.20 వేలను ఇంత వరకు అందించలేదు.



రెండు రోజుల్లో బాధ్యతలు : మావుళ్లమ్మను దర్శించుకున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ - 7లో..

- 7లో..



ఈ విజయాన్ని బాధ్యతగా తీసుకుంటా : తాడేపల్లిగూడెంలో మంత్రి నిమ్మలకు సన్మానం - 8లో..

- 8లో..

కువైట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో తూర్పు గోదావరి జిల్లాకి చెందిన ఇద్దరు మృతిచెందారు. ఒకరిది ఖండవల్లి కాగా మరొకరిది అన్నవర్పపాడు ...

- వార్త మెయిన్‌లో



గురువారం జిల్లా అంతటా బడిగంటలు మోగాయి..పిల్లలు బ్యాగ్‌లు, పుస్తకాలతో స్కూళ్లకు పరుగులు తీశారు.

ధాన్యం సొమ్ము ఏమైంది?


- ఉమ్మడి పశ్చిమలో రూ.1100 కోట్లకు పైగా బకాయి
- ఎన్నికల సమయంలో కాంట్రాక్టర్లకు ఇచ్చి రైతులకు దగా
- ఏప్రిల్ నెలాఖరు తరువాత ఒక్కపైసా రైతు చేతికి అందలేదు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రూపాయి కాదు రెండు రూపాయలు కాదు ఏకంగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి వారికి అక్షరాలా సర్కారు బకాయి పడింది రూ.1100 కోట్లు. సరిగ్గా ఎన్నికల సమయంలో ఏప్రిల్ నెలాఖరున ఉన్న సొమ్మంతా కాంట్రాక్టర్లకు ధారాదత్తం చేసి ఖజానా ఖాళీ చేసి అన్నదాతకు ఇవ్వాల్సిన బకాయిలు అప్పటి జగన్ ప్రభుత్వం గాలికొదిలేసింది. తమను ఆదుకోవాలని, వచ్చే ఖరీఫ్ సీజన్ అవసరాలకు తగిన సొమ్ము ఉంటేనే ముందుకు వెళ్తామని, పరిస్థితి అర్థం చేసుకోవాలంటూ వేడుకున్నా దిక్కుమొక్కులేదు. ఇప్పుడేమో సర్కారు చెల్లించాల్సిన బకాయి కాస్తా వందల కోట్లకు చేరింది. ఈ సొమ్ము అంతా రైతు చేతికి ఎప్పుడు చేరుతుందో సమాధానం చెప్పేవారే లేరు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు జోక్యం చేసుకుంటేనే తాము ఒడ్డెక్కుతామని రైతుల ఘోషిస్తున్నారు.

ఇంత బకాయి ఎందుకు?

ఈ రబీ సీజన్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 7.20 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ఇంతకుముందు ప్రభుత్వం నిర్ణయించింది.



ఆ మేరకే అధికారులను రంగంలోకి దింపింది. సాధ్యమైనంత మేర ధాన్యం కొనుగోళ్ళల్లో వేగవంతం చేయాలంటూ లక్ష్యాలను చేరుకునేందుకు హడావుడి చేశారు. కాని రైతులకు ఎప్పటికప్పుడు ఇవ్వాల్సిన కొనుగోలు చేసిన ధాన్యానికి సొమ్ములు పక్కన పెట్టేశారు. రైతుల నుంచి దాదాపు ఏడు లక్షల టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేసి సొమ్ములు చెల్లించాల్సిన ఉండగా నిర్దేశించిన తేదీ నాటికి కేవలం 6 లక్షల 30 వేల టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయగలిగారు. దఫాల వారీగా రైతుల ఖాతాల్లోకి సుమారు 400 కోట్లకు పైగా చెల్లించగలిగారు. ఈలోపే అధికార యంత్రాంగం యావత్తు ఎన్నికల నిర్వహణలో పడిపోవడంతో ధాన్యం సేకరణ, రైతుకు అందాల్సిన బకాయిలపై సమీక్షించకుండా గాలి కొదిలేశారు. ఈ నేపథ్యంలోనే ఒక్క పశ్చిమ గోదావరి జిల్లాలోనే రూ.850 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ.250 కోట్లు ప్రభుత్వం రైతులకు బకాయిపడింది. ఏప్రిల్ 28 తర్వాత ఈ మొత్తంలో రూపాయి కూడా చెల్లించే సాహసం చేయలేక పోయారు.ఎలాగూ సర్కారు కూలిపోతుంది కాబట్టి రైతుల పట్ల అప్పటివరకు కపట ప్రేమ నటించిన వైసీపీ ప్రభుత్వం వీరందరినీ నేరుగా నట్టేట ముంచింది. ఏలూరు జిల్లాలోనే 2.40 లక్షల టన్నుల ధాన్యం కొనుగోళ్ళు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకుని దాదాపు 120 రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేశారు. సుమారు 17 వేల మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయగా, వారికి చెల్లించాల్సిన సొమ్ము 242 కోట్లకు పైబడే ఉంది. ఇప్పటికే తొలకరి దగ్గర పడుతోంది. ఖరీఫ్ పనులు ఆరంభం కావాల్సి ఉన్నాయి.చేతిలో సొమ్ము లేక కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

సీఎంతో మాట్లాడి ఆదుకుంటాం..

మంత్రి కొలుసు పార్థసారథి

ప్రభుత్వం రైతులకు బకాయి పడిన ధాన్యం సొమ్ముల విషయంలో గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యం దాగి ఉందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ధాన్యం కొనుగోళ్ళు, పెండింగ్ బకాయిలకు సంబంధించి గురువారం ఏలూరులో మీడియా మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. రైతు సమస్యలతో పాటు మిగతా సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్తాం, తగిన పరిష్కారం త్వరలోనే లభిస్తుంద న్నారు.

రేపు భీమవరంలో జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు

భీమవరం అర్బన్, జూన్ 13: జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు ఈనెల 15వ తేదీ శనివారం భీమవరంలోని వంశీనగర్ ఓల్గా ఆర్చరీ ఆకాడమీలో జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎల్. జయరాజు, కోచ్ సయ్యద్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకరులు తమ ఆధార్‌కార్డు, పుట్టిన సర్టిఫికెట్, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో శనివారం ఉదయం ఏడు గంటలకు భీమవరం ఆర్చరీ సెంటరుకు విచ్చేయాలన్నారు. పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 22న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. వివరాలకు 98491 81993 నంబరులో సంప్రదించాలన్నారు.

వేసవి సెలవుల్లో సృజనాత్మకతకు పదును

» క్రికెట్ స్టేడియం బొమ్మ తయారు చేసిన విద్యార్థులు


స్టేడియం బొమ్మను అందజేస్తున్న విద్యార్థులు

ఏలూరు రూరల్, జూన్ 13: వేసవి సెలవు ల్లో సమయాన్ని వృథా చేయకుండా కొందరు విద్యార్థులు సృజనాత్మ కతకు పదునుపెట్టారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి హైస్కూల్‌కు చెందిన ఆరో తరగతి విద్యార్థులు ఫణికృష్ణవర్మ, సాయికృష్ణవర్మ క్రికెట్ స్టేడియం మాదిరి తయారుచేసి బొమ్మ, పలు బోధనోపకరణాలను పాఠశాల పునఃప్రారంభమైన సందర్భంగా ఉపాధ్యాయులకు అందజేశారు. నేటితరం విద్యార్థులకు సరైన ప్రోత్సాహాన్ని అందిస్తే అద్భుతాలు చేయగలరని క్రికెట్ స్టేడియంలో అన్ని సౌకర్యాలను పొందుపరుస్తూ ఆరో తరగతి విద్యార్థులు తయారు చేసిన స్టేడియం ఆకర్షణీయంగా ఉంది. పాఠశాల హెచ్‌ఎం ఎస్.వెంకటలక్ష్మి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, ఉపాధ్యాయులు అపర్ణ, శివశంకర్, ఉషశ్రీ, దుర్గ, యశ్విన్, మణి తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో 'బడేటి చంటి తాలూకా'

» టి-20 క్రికెట్ మ్యాచ్‌లో ఏలూరు యువకుల సందడి



ఫ్లకార్డు ప్రదర్శిస్తున్న ఏలూరు వాసి సాయికృష్ణ

ఏలూరు స్పోర్ట్స్, జూన్ 13: అమెరికాలో యూఎస్ఏ, ఇండియా టీ-20 క్రికెట్ మ్యాచ్ బుధవారం జరిగింది. ఈ పోటీల్లో ఎన్ఆర్ఐలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఏలూరుకు చెందిన పలువురు యువకులు ఆ స్టేడియంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఘన విజయం సాధించిన సందర్భంగా ఏలూరు బడేటి రాధాకృష్ణ, ఎమ్మెల్యే తాలూకా అంటూ పెద్దఎత్తున ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ సందడి చేశారు. ఫ్లకార్డుతో స్టేడియం చుట్టూ తిరుగుతూ కేరింతలు కొట్టారు. అమెరికాలోని బడేటి చంటిపై ఉన్న అభిమానంతో క్రికెట్ పోటీలకు హాజరై సందడి చేసినట్టు ఏలూరు వాసి వేమూరి సాయికృష్ణ తెలిపారు.

వాణిజ్య పన్నులశాఖలో అరాచకాలు అరికట్టాలి

ఏలూరు రూరల్, జూన్ 13 : రాష్ట్ర ఆదాయానికి వెన్నెముకగా ఉన్న వాణిజ్య పన్నుల శాఖలోని కొంతమంది ఉన్నతాధికారులు సాగించిన అరాచకాల వల్ల ఈ శాఖ భ్రష్టుపట్టిపోయిందని, ఈశాఖను కొత్త ప్రభుత్వం ప్రక్షాళన చేయాలని ఆంధ్రప్రదేశ్ వాణిజ్యపన్నుల సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు కె.ఆర్.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలైన అధికార వికేంద్రీకరణ సూత్రానికి వ్యతిరేకంగా వాణిజ్యపన్నులశాఖలో అధికారాల కేంద్రీకరణ జరిగిందన్నారు. అన్ని అధికారాలను ప్రధాన కార్యాలయంలోని కొంతమంది అధికారులు తమవద్దే ఉంచుకుని క్షేత్రస్థాయిలో సర్కిల్ కార్యాలయాలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలోని కొంతమంది పెద్దలతో కుమ్మక్కై శాఖ పునర్వవస్థీరణ పేరుతో పక్కదోవ పట్టించిన కొంతమంది ఉన్నతాధికారులు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొట్టారని ఆరోపించారు. వీరి చీకటి వ్యవహారాలను వాణిజ్య పన్నుల సర్వీసెస్ అసోసియేషన్ ప్రశ్నిస్తే అక్రమకేసులు బనాయించి వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం కొత్త ప్రభుత్వం ఉద్యోగుల పక్షాన సమస్యలను పరిష్కరించి వాణిజ్యపన్నులశాఖలోని అరాచకాలను అరికట్టాలని డిమాండ్ చేశారు.

విజయవాడ - కాకినాడ పోర్టు రైలు పునరుద్ధరణ

ఏలూరు క్రైం, జూన్ 13 : విజయవాడ నుంచి కాకినాడ పోర్టుకు వెళ్ళే రైలు (17257) ను తిరిగి పునరుద్ధరణ చేస్తున్నట్లు విజయవాడ దక్షిణమధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. ఏలూరు మీదుగా వెళ్లే అనేక రైళ్లను రద్దు చేశారు. అయితే విజయవాడ-కాకినాడ పోర్టుకు వెళ్ళే ఈ రైలు ఈనెల 21వ నుంచి ఆగస్టు 15 వరకు, తిరిగి సెప్టెంబరు 16 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకూ మాత్రమే నడుస్తుందని, అనంతరం తదుపరి ఆదేశాలతో రైలు నడుస్తుందని తెలిపారు.

గోదావరి క్లస్టర్ విశ్వ విద్యాలయానికి

యాప్సీ ప్రాజెక్టు మంజూరు

» నన్నయ ఉపకులపతి పద్మరాజు



వీసీ చేతుల మీదుగా ప్రాజెక్టు పత్రాలను అందుకుంటున్న విజయనిర్మల

రాజమహేంద్రవరం, జూన్ 13: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నతవిద్యామండలి (యాప్సీ) గోదావరి క్లస్టర్ యూనివర్సిటీకి ప్రాజెక్టు మంజూరు చేశారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్‌లలో ఒకరైన నన్నయ విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగ అధ్యాపకులు పి.విజయనిర్మలకు ప్రాజెక్టు పత్రాలను గురువారం వీసీ అందజేశారు. ఈ సందర్భంగా వీసీ విలేకరులకు తెలిపిన వివరాలివి.. యాప్సీ గోదావరి క్లస్టర్ యూనివర్సిటీలైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, తాడేపల్లిగూడెంలోని ఎన్.ఐ.టి, డాక్టర్ వై.ఎస్.ఆర్.ఉద్యాన విశ్వ విద్యాలయాలకు రూ.10 లక్షల ప్రాజెక్టు మంజూరు చేశారన్నారు. వేస్ట్ టు వెల్త్, పెక్టిన్‌ని అగ్రో- వేస్ట్ నుంచి విలువ జోడించిన న్యూట్రాస్యూటికల్స్‌గా మార్చడం, ఆహారం, ఫార్మా పరిశ్రమలో సంభావ్య అప్లికేషన్ అనే ప్రాజెక్టును రెండు సంవత్సరాల కాల వ్యవధిలో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్లుగా నన్నయ విశ్వవిద్యాలయం జంతు శాస్త్రవిభాగం అధ్యాపకురాలు విజయనిర్మల, తాడేపల్లిగూడెంలోని ఎన్.ఐ.టి. జీవసాంకేతిక విజ్ఞానశాస్త్రం అధ్యాపకుడు టి.జగన్మోహనరావు, డాక్టర్ వై.ఎస్.ఆర్. ఉద్యానవిశ్వవిద్యాలయం జీవరసాయనశాస్త్రం ఆచార్యులు డి.ఆర్.సలోమిసునీత వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల నిధి లెక్కలేవి ?

తమ భవిష్యత్తు కోసం ప్రభుత్వ ఉద్యోగులు దాచుకొన్న సొమ్ము ఉందో లేదో ఏమైందో తెలియని పరిస్థితి నెలకొంది. తాము దాచుకొంటున్న సొమ్ము తమ ఖాతాల్లో ఎంతవరకు జమయ్యాయో లేదో తెలియని పరిస్థితి. నెల వారీగా తమ జీతం నుంచి మినహాయించిన సొమ్ము తమ పీఎఫ్ ఖాతాల్లోకి జమ అవుతోందో లేదో అని ఉమ్మడి పశ్చిమ జిల్లాలో వేలాదిమంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఆన్‌లైన్ ద్వారా ఎప్పటికప్పుడు తమ బ్యాలెన్స్ షీట్లు చూసుకొనే ఉద్యోగులు గత ప్రభుత్వ హయాంలో ఆన్‌లైన్ చేయకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నాలుగేళ్లుగా విడుదల కాని పీఎఫ్ బ్యాలెన్స్ షీట్స్



ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఉద్యోగుల వివరాలు
ఉద్యోగులు సంఖ్య : 7,726
మండలాలు : 48
పీఎఫ్ సొమ్ము పంపే డ్రాయింగ్ అథారిటీల సంఖ్య : 518

» ఉద్యోగి జీతం నుంచి మినహాయించిన సొమ్ముపై ఆందోళన
» ప్రతినెలా సుమారు రూ.3 కోట్ల నుంచి 5 కోట్లు సొమ్ము మినహాయింపు
» నాలుగేళ్లలో సుమారు రూ.240 కోట్ల సొమ్ముకు జమాఖర్చులు నిల్
» బ్యాలెన్స్ షీట్ లేకపోవడంతో రుణ దరఖాస్తులకు అవకాశం లేదు
» పదవీ విరమణ చేసే ఉద్యోగికి దక్కని బ్యాలెన్స్ షీట్స్

నిడమర్రు, జూన్ 13 :
ఉమ్మడి పశ్చిమ జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగుల నుంచి ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారి జీత భత్యాల నుంచి సుమారు రూ.6 వేల నుంచి రూ. 15 వేల వరకు సొమ్ము మినహాయించబడి సదరు డ్రాయింగ్ అథారిటీ ద్వారా జిల్లా పరిషత్ కార్యాలయంలో గల ప్రావిడెంట్ ఫండ్ విభాగానికి పంపిస్తారు. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో సుమారు 7,726 మంది ఉద్యోగులకు గత నాలుగేళ్లుగా ప్రావిడెంట్ ఫండ్ బ్యాలెన్స్ షీట్స్ ఇవ్వలేదని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. సుమారు 2020-21, 2021-22, 2022-23, 2023-24 సంవత్సరాలకు గాను ఉద్యోగులు.. ఉపాధ్యాయులు, ప్రభుత్వ సర్వెంట్లకు తమ భవిష్యనిధి ఖాతా బ్యాలెన్స్ షీట్లు ఇవ్వకపోవడం పట్ల విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతినెల కోట్ల రూపాయల సొమ్ము మినహాయింపు..

ప్రతి నెల ఉద్యోగికి మంజూరైన జీతభత్యాల నుంచి ఆయా డ్రాయింగ్ అథారిటీ వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొంత సొమ్ము మినహాయించి ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు పంపిస్తారు. ఈవిధంగా పంపబడిన సొమ్ము ఆయా ఉద్యోగుల పీఎఫ్ ఖాతాలలో జమ చేస్తారు. జమ చేసిన సొమ్ము వారి ఖాతాల్లోకి చేరాలి. ప్రతి ఉద్యోగికి తన సొమ్ము తమ ఖాతాలలో జమ చేయబడుతుందో లేదో అనుమానం ఇక్కడ వ్యక్తం చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం వారికి తమ ఖాతా బ్యాలెన్స్ షీట్లు ప్రతి ఏడాది ఇవ్వకపోవడమే అని తెలుస్తుంది. ప్రతినెల ఒక ఉద్యోగి సగటున రూ. 7 వేల నుంచి రూ. 10 వేల వరకు సొమ్మును తన ఖాతాలోకి జమచేసుకొంటాడు. ఈ లెక్కన నెలకు రూ.5 కోట్లు సొమ్ము జమచేయబడుతుంది. నెలకు రూ.5 కోట్లు చొప్పున ఏడాదికి 60 కోట్లు రూపాయలు సొమ్ము చేయబడుతుంది. ఈ నాలుగేళ్లలో సుమారు రూ.240 కోట్లు సొమ్ముకు జమాలెక్కలు లేకుండా పోయాయని ఉద్యోగులు మొత్తుకుంటున్నారు. గతంలో ఎన్నిసార్లు విజ్ఞాపన పత్రాలు సమర్పించినా బుట్టదాఖలాలు అయ్యాయే గానీ ఈ విషయం ముందుకు సాగలేదని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. బ్యాలెన్స్ షీట్ లేకపోవడంతో ఋణ దరఖాస్తులు పెట్టుకోవడం లేదు.

బ్యాలెన్స్ షీట్లు అందించాలి



గత నాలుగేళ్లుగా ఉద్యోగులు, ఉపాధ్యాయుల భవిష్య నిధి ఖాతాలకు సంబంధించి బ్యాలెన్స్ షీట్లు పంపిణీ చేయడం లేదు. తమ ఖాతాల్లో ఎంత సొమ్ము జమ చేయబడుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఖాతా నిర్వహణ సక్రమంగా జరగక పోవడం అనేక అనుమానాలకు దారితీస్తోంది. సత్వరం పీఎఫ్ ఖాతాల నిర్వహణ ఆధునీకరించి బ్యాలెన్స్ షీట్లు అందజేయాలని కోరుతున్నాం.

- పువ్వుల ఆంజనేయులు
అధ్యక్షుడు, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం, ఏలూరు జిల్లా

భవిష్యనిధి ఖాతాల అప్డేషన్ జరుగుతుంది



ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో గల 48 మండలాల్లో 7,726 మంది ఉద్యోగుల భవిష్య నిధి ఖాతాల అప్‌డేషన్ కార్యక్రమం త్వరితగతిన జరుగుతుంది. మరో వారం.. పది రోజుల్లో బ్యాలెన్స్ షీట్లు ఆధునికీకరణ పూర్తికావస్తోంది. నూతన ప్రభుత్వ హయాంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బ్యాలెన్స్ షీట్లు పంపిణీకి చర్యలు తీసుకుంటాం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సీఎంఎఫ్ఎస్‌లో నమోదు చేసినటువంటి 41 పాక్షిక ఉపసంహరణలు, ఒక తాత్కాలిక ఋణములు, ఎనిమిది పదవీ విరమణ బిల్లులు మంజూరు చేశాం.

- కె.ఎస్.ఎస్.సుబ్బారావు
సీఈవో, జిల్లా పరిషత్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా

పీఎఫ్ ఖాతా సక్రమ నిర్వహణ నిల్..

ఉద్యోగుల పీఎఫ్ ఖాతాలు సక్రమ నిర్వహణ లేకపోవడంతో తీవ్ర ఆందోళన నెలకొంది. తమ మినహాయింపు సొమ్ము తమ ఖాతాలో ఉన్నదీ లేనిదీ తెలియక ఉద్యోగులు ఆందోళన బాటపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ రోడ్డు ఎక్కడానికి సిద్ధమవుతున్నారు పీఎఫ్ సొమ్ములో సవరణలు కూడా జరుగుతున్నదీ లేనిది తెలియక ఉద్యోగులు నష్టపోతున్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి దక్కని బ్యాలెన్స్ షీట్స్..

ఈ ఏడాది పెద్దమొత్తంలో ఉద్యోగులు పదవీ విరమణ చేయబోతున్నారు. పదవీ విరమణ చేయబోయే ఉద్యోగులకు కూడా తమ భవిష్య నిధి ఖాతాల బ్యాలెన్స్ షీట్లు అందక తికమక పడుతున్నారు. తమ ఖాతా స్టేట్‌మెంట్ల కోసం పలుమార్లు ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. లెక్కలు తేలక అధికారులు ఎంత సొమ్ము ఇస్తే అంతే తీసుకోవాల్సి వస్తోందని పదవీ విరమణ చేసే ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరిస్తా..

» కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

భీమవరంటౌన్, జూన్ 13 : రెండు రోజుల్లో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తానని భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరంలో మావుళ్ళమ్మ అమ్మవారిని గురువారం ఆయన దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకోగా అర్చకుడు కొడమంచిలి కోప్పేశ్వర శర్మ పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరపున ఈవో బుద్ద మహాలక్ష్మినగేష్ అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రాన్ని, ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రికి ఆరోగ్యం బాగాలేక పోవడంతో భీమవరం వచ్చానని, పెద్దల నిర్ణయంతో బాధ్యత స్వీకరణ జరుగుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్లలో ఒక కొత్త పరిశ్రమలు వచ్చిన సందర్భం లేదని అన్నారు. కేంద్రమంత్రి కుమార స్వామి సహకారంతో రాష్ట్రంలో కొత్త పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తామన్నారు.

క్రైం కార్నర్

లారీ ఢీకొని మహిళ మృతి

పాలకోడేరు, జూన్ 13: లారీ ఢీకొన్న ప్రమాదంలో పాలకోడేరు గ్రామానికి చెందిన మానేపల్లి పూర్ణ (40) అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గురువారం విస్సాకోడేరు లాకుల సమీపంలో చోటు చేసుకుంది. పాలకోడేరు గ్రామానికి చెందిన మానేపల్లి నాగేశ్వరరావు భార్య పూర్ణ కుమారుడు మానేపల్లి హర్షవర్ధన్ స్కూటీపై ఎక్కి విస్సాకోడేరు మీదుగా జిన్నూరు వెళ్తున్నారు. అదే సమయంలో లారీ స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మానేపల్లి పూర్ణ అక్కడికక్కడే మృతి చెందింది. దీని పై కుమారుడు హర్షవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాలకోడేరు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


శివనాగరాజు మృతదేహం

తణుకు, జూన్ 13 : ఉండ్రాజవరం మండలం తాడిపర్రుకు చెందిన గాజులపాటి శివనాగరాజు(25) అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన తేతలి గ్రామ పరిధిలోని బుధవారం రాత్రి జరిగింది. తణుకు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలివి.. పైడిపర్రులోని ఓ కర్మాగారంలో పనిచేస్తు న్నాడు. చివటం నుంచి తేతలి వెళ్లే రోడ్డులోని పంటబోదెలో పడి మృతి చెందాడు. బోదె గట్టు వద్ద మోటారు సైకిల్ ఉంది. స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపు తప్పి పంటబోదెలో పడి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఆయనకు భార్య శిరీష, ఏడాదిన్నర బాబు ఉన్నాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మద్యం మత్తులో ఘర్షణ.. ఒకరి మృతి

తణుకు, జూన్ 13 : మద్యం మత్తులో ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి మరణించిన ఘటన తణుకు మండలం దువ్వలో జరిగింది. తణుకు రూరల్ సీఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాలివి.. దువ్వ గ్రామంలో మద్యం దుకాణం వద్ద పెరవలి మండలం ముక్కామల గ్రామానికి చెందిన భాస్కరావు(40), దువ్వకు చెందిన రామకృష్ణ మధ్య గురువారం గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో రామకృష్ణ గాజు పెంకుతో భాస్కరరావును పొడవడంతో మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆగిన లారీని ఢీ కొట్టిన బైక్.. వ్యక్తికి గాయాలు

ఉంగుటూరు, జూన్ 13 : ఆగి వున్న లారీని ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఉంగుటూరు శివారు జాతీయ రహదారిపై గురువారం జరిగింది. చేబ్రోలు పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉంగుటూరు శివారులో కాలకృత్యాల నిమిత్తం లారీని ఆపిన సమయంలో భీమడోలు మండలం కురెళ్లగూడెం గ్రామానికి చెందిన దుగ్గిరాల లక్ష్మణరావు (55) అనే వ్యక్తి కురెళ్లగూడెం నుంచి నిడదవోలుకు వెళుతున్న సమయంలో లారీ కుడివైపున ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చేబ్రోలు పోలీసులు తెలిపారు.

మూడు మోటారు సైకిళ్లు చోరీ

ఉండి, జూన్ 13: ఒకే ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ముగ్గురు వ్యక్తుల మోటారు సైకిళ్లు చోరీకి గురయ్యాయి. ఉండి పోలీసులు తెలిపిన వివరాలివి.. మే ఏడో తేదీన ఉండి మండలం వాండ్రం గ్రామంలో వెల్‌కం ఫ్యాక్టరీలో పనిచేస్తున్న చింతపల్లి దుర్గముఖేష్‌కు చెందిన బైక్.. అదే ఫ్యాక్టరీలో పనిచేస్తున్న మంతెన ఉమామహేశ్వరరావు ఈనెల ఐదో తేదీన మోటారు సైకిల్ చోరీకి గురయింది. అదే ఫ్యాక్టరీలో పనిచేస్తున్న వుమన్ కుట్టికి చెందిన బైక్ ఈనెల 12వ తేదీన చోరీకి గురయినట్టు పోలీసులు తెలిపారు. వీరి ముగ్గురు బైక్‌లు ఫ్యాక్టరీలో పనిచేస్తున్న సమయంలో తస్కరణకు గురయినట్టు తెలిపారు. గురువారం ముగ్గురు వ్యక్తులు పోలీస్ స్టేషన్‌కు విచ్చేసి ఫిర్యాదు చేసినట్టు పోలీసులు తెలిపారు.. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ముసునూరు, జూన్ 13: వ్యక్తి అదృశ్యంపై ముసునూరు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కాట్రేనిపాడుకు చెందిన పెదగర్ల సతీష్ ఈనెల ఆరో తేదీన ఉదయం పనికి వెళ్తున్నానని భార్యకి చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇప్పటికి వరకు తిరిగిరాలేదు. గురువారం తండ్రి పెదగర్ల జయసుందరం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

నడిరోడ్డుపై నిలిచిన ఆర్టీసీ అమరావతి బస్సు


ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై నిలిచిన ఆర్టీసీ బస్సు

ఏలూరు క్రైం, జూన్ 13 : విశాఖపట్టణం నుంచి విజయవాడకు వెళ్తున్న అమరావతి ఏసీ బస్సు ఏలూరు నగరంలో ఆకస్మికంగా నడిరోడ్డుపై నిలిచిపోయింది. విశాఖపట్టణంలో గురువారం ఉదయం బయలుదేరిన ఈ బస్సు విజయవాడకు వెళ్లి తిరిగి విజయవాడ నుంచి విశాఖపట్టణం వెళ్లాల్సి ఉంది. ఏలూరు నగరంలో ఫైర్‌స్టేషన్ నుంచి కొత్త బస్టాండ్‌వైపు వెళ్తుండగా టూటౌన్ పోలీస్ స్టేషన్ ముందుకు వెళ్ళే సరికి ఆ బస్సు సాంకేతిక లోపం తలెత్తింది. ఈ నేపథ్యంలో డ్రైవర్ సమయస్ఫూర్తితో బస్సును డివైడర్ మధ్య భాగంగా స్టేషన్ ముందు నిలిపారు. బస్సు వెళ్ళడానికి అవకాశం లేకపోవడంతో అలానే ఉంచి సంబంధిత ఆర్టీసీ అధికారులకు సమాచారం ఇచ్చారు. చివరకు గంటకు పైగా ప్రయాణికులు బస్సులోనే ఉండిపోయారు. ఏసీ బస్సు కావడంతో ఏసీ మాత్రం యథావిధిగా పనిచేసింది. చివరకు మరో బస్సు ద్వారా ప్రయాణికులను విజయవాడకు పంపించి వేశారు. బస్సు నడవడానికి సెన్సార్‌లో లోపం ఏర్పడిందని ప్రాథమికంగా డ్రైవర్ గుర్తించి సంబంధించి అధికారులకు తెలిపారు. ఈ బస్సు పరిజ్ఞానం సంబంధిత కంపెనీకి చెందిన ఇంజనీర్లు, టెక్నీషియన్లు వచ్చిన తరువాత గురువారం రాత్రి 9 గంటల తరువాత బస్సుకు మరమ్మతులు చేపట్టి తీసుకెళ్లారు.


లింగపాలెంలో అక్రమ మట్టి తోలకం పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మట్టిని అక్రమంగా తరలిస్తే చర్యలు

లింగపాలెం, జూన్ 13: మట్టిని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దారు ప్రసాద్ హెచ్చరించారు. ధర్మాజీగూడెం గ్రామంలో రెండు రోజులుగా మట్టి తవ్వకాలు జరుపుతున్నట్టు గ్రామస్థుల ఫిర్యాదు మేరకు గురువారం ఆ ప్రాంతాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మట్టి తవ్వకాల విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. చర్యలు తీసుకునేందుకు రెవెన్యూ సిబ్బందితో కలసి మట్టి తవ్వకాలు జరిపిన ప్రాంతం గుర్తించామన్నారు. చెరువులో మట్టి తవ్వకాలు జరిపి పక్కనే ఉన్న పొలాల్లో వేస్తున్నట్టు ఉండడంతో అక్రమ తవ్వకందారులపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అక్రమ మట్టి తోలకాలు జరిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. లింగపాలెం మండలంలో అధికారుల అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టి అక్రమ తవ్వకాలు జరిపి అధిక ధరలకు అమ్ముతూ కొంతమంది అక్రమ అర్జనకు పాల్పడుతున్నారు. రెండు రోజులుగా మండలంలోని ధర్మాజీగూడెంలో మట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

తాటియాకులగూడెంలో..

● జీలుగుమిల్లి : జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెంలో రెండు రోజులుగా రాత్రి సమయంలో మట్టి అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. మట్టి తరలించేందుకు ఎటువంటి అనుమతులు లేకున్నా ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకుని మట్టి అక్రమ తవ్వకాలు జరిపి కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై మట్టి తవ్వకం జరిపే వారిని అడగ్గా ఓ వీఆర్వోకు సంబంధించిన స్థలం మెరక చేసేందుకు షెడ్డు నిర్మాణం చేపట్టే ప్రాంతంలో మట్టిని పోస్తున్నట్టు ట్రాక్టర్ల డ్రైవర్లు చెబుతున్నారు. ఈ విషయమై తాటియాకులగూడెం వీఆర్వో బుల్లి అబ్బులును వివరణ కోరేందుకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయడం లేదు, తహసీల్దారు సైతం ఫోన్‌లో మాట్లాడేందుకు అందుబాటులోకి రాని పరిస్థితి నెలకొంది.

పోక్సో కేసులో యువకుడికి జైలు

కలిదిండి, జూన్ 13:బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడు జైలు పాలయ్యాడు. మండలంలో పోతుమర్రు పంచాయతీ పరిధిలోని గొల్లగూడెంకు చెందిన యువకుడు నారగాని మణికంఠ ఓ బాలికపై 2021 జూన్ 10న లైంగిక వేధింపులకు పాల్పడడంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఏ-1 ముద్దాయి నారగాని మణికంఠపై కేసు రుజువు కావడంతో ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.రెండు వేలు జరిమానా మచిలీపట్నం 9వ అడిషనల్ జిల్లా జడ్జి గాజుల వెంకటేశ్వరరావు విధించారని కలిదిండి ఎస్ఐ ప్రియకుమార్ తెలిపారు.

ఆర్టీసీ బస్ ఢీకొని యువకుడికి గాయాలు

ఆగిరిపల్లి, జూన్ 13: అడవినెక్కలం గ్రామం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థికి గాయాలయ్యాయి. విజయవాడ నుంచి ఎస్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నాలుగో సంవత్సరం చదువుతున్న సంపంగి ఈశ్వరరావు బైక్ మీద కాలేజీకి వస్తుండగా నూజివీడు నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా ఢీ కొట్టింది. దీంతో విద్యార్థికి తీవ్ర గాయాలు కాగా స్థానికుల సహాయంతో అంబులెన్స్‌లో విజయవాడ ఆసుపత్రికి తరలించారు. ఆగిరిపల్లి ఎస్ఐ సురేంద్ర కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్డీఏ జెండా ధ్వంసం.. కేసు నమోదు


ఎన్డీయే జెండాను ధ్వంసం చేస్తున్న సర్పంచి భర్త మాన్‌సింగ్

భీమడోలు, జూన్ 13 : భీమడోలు మండలం అర్జావారిగూడెం గ్రామంలో సర్పంచ్ పాము సునీతమాన్‌సింగ్ కుటుంబం.. అదే ఇంట్లో నివాసం ఉండే ఆమె సోదరుడు అశ్వినీకుమార్ మధ్య ఇంటి విషయమై పాత వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 12వ తేదీన ఎన్డీఏ కూటమి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబుకు సంఘీభావంగా అశ్వినీకుమార్ భార్య వారి ఇంటి వద్ద ఎన్డీఏ జెండాను ఎగురవేశారు. కోపగించిన సర్పంచి భర్త మాన్‌సింగ్ జెండాను ధ్వంసం చేసి అశ్వినీ కుమార్ దంపతులను కొట్టి గాయపరచగా భీమడోలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కూటమి కార్యకర్తలను అవమాన పరిచేలా జెండాను ధ్వంసం చేశాడంటూ ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

కొత్తపాలెంలో వైసీపీ కార్యకర్తల దాడి

మొగల్తూరు, జూన్ 13: కొత్తపాలెంలో జనసేన కార్యకర్తపై వైసీపీ కార్యకర్తలు గురువారం దాడి చేసినట్టు తెలిసింది. గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకొని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ రెండు ఫ్లెక్సీల మధ్యన ఉన్న ఖాళీ ప్రాంతంలో వైసీపీ వర్గీయులు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి లీడర్ అంటూ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇదిలా ఉండగా జనసేన కార్యకర్త తాడి రవి సార్వత్రిక ఎన్నికల్లో జనసేన విజయానికి కృషి చేసినందుకు వైసీపీకి చెందిన పలువురు గురువారం సామూహిక దాడికి పాల్పడినట్టు బాధితుడు తెలిపారు.


మొక్కు తీర్చుకునేందుకు ద్వారకాతిరుమల వెళ్తున్న టీడీపీ నాయకులు

శ్రీవారి క్షేత్రానికి కాలినడకన కూటమి నాయకులు

పోడూరు, జూన్ 13 : కూటమి కొలువు తీరి చంద్రబాబు సీఎం, పవన్ కల్యాణ్‌కు కీలక పదవి, నిమ్మల రామానాయుడు మంత్రి పదవి రావాలని కోరుతూ ఎన్నికల ముందు టీడీపీ నాయకులు మొక్కుకున్నారు. ద్వారకా తిరుమల శ్రీవారి క్షేత్రానికి కాలినడకన వస్తామని పోడూరు మండల టీడీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో కూటమి నాయకులు మొక్కుకున్నారు. ఈమేరకు గురువారం మొక్కు తీర్చుకు నేందుకు కొమ్ముచిక్కాల నుంచి ద్వారకాతిరుమలకు కాలినడకన నాయకులు బయలుదేరి వెళ్లారు. ఎంపీటీసీ నాగరాజు సుజాత, పాలా నాగలక్ష్మి, మేడిశెట్టి బుజ్జి, యాళ్ల శ్రీను, గుడాల ప్రసాదుతో పాటు 50 మంది పాదయాత్రగా నడిచి వెళ్లారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురండి

» పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీ అధికారి విక్టర్

మొగల్తూరు, జూన్ 13 :గ్రామ పంచాయతీల పరిధిలో నిర్మించిన సంపద కేంద్రాలు తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ ఆదేశించారు. గురువారం మొగల్తూరు ప్రధాన కాల్వ వెంబడి పేరుపోయిన చెత్తాచెదారాల తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో కాల్వలు, నివాసాల మధ్య చెత్తకుప్పలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలతో జిల్లాలోని 409 గ్రామ పంచాయతీల పరిధిలో చెత్త తొలగింపు పనులు చేపట్టామన్నారు. పంచాయతీ సొంత నిధులు, 15వ ఆర్థిక సంఘ నిధులు వినియోగించుకుని గ్రామాల్లో చెత్త పేరుకుపోకుండా శివారు ప్రాంతాల్లో డంప్ చేయాలన్నారు. పంచాయతీల పరిధిలో డంపింగ్ యార్డ్‌ల సమస్యపై వినతులు వస్తున్నాయని వాటి పరిష్కారానికి ప్రభుత్వ ఆదేశాల కనుగుణంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్, పంచాయతీ కార్యదర్శి గంగన్న, ఉప సర్పంచ్ బోణం నరసింహారావు, వార్డు సభ్యులు మెట్ల రాంబాబు, ముక్కు గోపాలకృష్ణ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి

వేలేరుపాడు, జూన్ 13:టీడీపీ సీనియర్ కార్యకర్త ఆరే శ్రీనివాసరావు(54) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారానికి బైక్‌పై విజయవాడ వెళ్లి తిరిగి వస్తున్న తరుణంలో తెలంగాణలోని అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామం మలుపు వద్ద గేదె అడ్డురావడంతో కిందపడి తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు అశ్వారావుపేట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఈ ప్రమాదఘటన బుధవారం రాత్రి 9.30 గంటలకు జరగడంతో ప్రమాదంలో గాయపడింది ఎవరో తెలియకపోవడంతో సోషల్ మీడియాలో ఫొటోలు పోస్టు చేయడంతో వేలేరుపాడుకు చెందిన శ్రీనివాసరావు అని తెలిసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా నర్సారావుపేట చేరుకున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఆయన మృతి చెందడం టీడీపీ నాయకులు, కార్యకర్తలను కలచివేసింది. గురువారం ఉదయం పోస్టుమార్టం పూర్తయిన అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించడంతో వేలేరుపాడులోని గృహానికి తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు.

కల్లుగీత సొసైటీలకు మద్యం షాపులు కేటాయించాలి



మాట్లాడుతున్న నరసింహమూర్తి

భీమవరం అర్బన్, జూన్ 13: రాష్ట్రంలో కల్లు గీత సొసైటీలకు 40శాతం మద్యం షాపులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నర్సింహమూర్తి విజ్ఞప్తి చేశారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతూ కష్టాల్లో ఉన్న కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం గీత కార్మికుల సమస్యలు పట్టించుకోలేదన్నారు. నేడు అధికారంలోకి వచ్చిన నూతన ప్రభుత్వం తక్షణం ఎక్సైజ్ శాఖను తక్షణం ప్రక్షాళన చేయాలని, ఆదరణ పథకం పునరుద్ధరించి గీత కార్మికులను ఆదుకోవాలన్నారు.

ధాన్యం బకాయిలు విడుదల చేయాలి

భీమవరం అర్బన్, జూన్ 13: రైతులకు ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. రైతులకు ధాన్యం బకాయిలు రూ.100కోట్లు పేరుకుపోయి, దాళ్వా మాసుళ్ల సొమ్ము సుమారు రూ.900కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉందన్నారు. సార్వా బకాయిలు కూడా ఉన్నట్లు తెలుస్తోందని ఇది బాధాకరమన్నారు. తక్షణమే ప్రభుత్వం బకాయిల సొమ్ము విడుదల చేయలన్నారు.

అన్న క్యాంటీన్ ఏర్పాటు అభినందనీయం

ఆకివీడు, జూన్ 13: జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిందని, కోలుకునే వరకు దాతల సహకారం అవసరమని ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణరాజు అన్నారు. ఆకివీడులో అన్న క్యాంటీన్ ఏర్పాటుచేసిన దాతలు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు, టీడీపీ శ్రేణులను ఆయన అభినందించి మాట్లాడారు. ఉండి నియోజకవర్గ అభివృద్ధికి ప్రయత్నాలు మొదలు పెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, క్లస్టర్ ఇన్‌చార్జి గొంట్లా గణపతి, పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం ఉమా, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు, కోపల్లె సాయి పాల్గొన్నారు.

రైస్ మిల్లర్ వీరాస్వామి మృతి



ఆకివీడు, జూన్ 13: ఆకివీడు రైస్ మిల్లర్ నాగులపల్లి వీరాస్వామి (83) గురువారం తెల్లవారుజామున మరణించారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు. వీరాస్వామి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 200 రైస్ మిల్లులు నిర్మాణం చేశారని కార్మికులు తెలిపారు. రైస్ మిల్లర్స్ ప్రముఖులు సంతాపం తెలిపారు.

తొలి రోజు 89 శాతం విద్యార్థులు హాజరు



పాలకొల్లు అర్బన్, జూన్ 13 : వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. పాఠశాల ల్లో మామిడి తోరణాలు కట్టి అలంకరించారు. మొత్తంగా 89శాతం విద్యార్థులు పాఠశాలలకు హాజరైనట్లు ఎంఈవో శర్మ తెలిపారు. గరల్స్ హైస్కూల్లోని సరస్వతి దేవి విగ్రహానికి పూల మాలలు వేసి విద్యార్థినీలు హాజరైనట్లు హెచ్ఎం వై ప్రభాకర శాస్త్రి తెలిపారు. నూతనంగా పాఠశాలల్లో చేరే వారు దరఖాస్తులు తీసుకున్నారు. అలాగే ఉత్తీర్ణులైన వారు, ఇతర ప్రాంతాలకు వెళ్ళే విద్యార్థులు టీసీలు తీసుకునేందుకు దరఖాస్తులు చేసుకున్నారు. యథావిధిగా మధ్యాహ్న భోజన పథకం మెనూ మేరకు ఏర్పాటు చేశారు.

పోరాటాలతోనే కార్మిక సమస్యల పరిష్కారం

పాలకొల్లు అర్బన్, జూన్ 13: ఐక్య పోరాటాల ద్వారానే కార్మిక సమస్యలు పరిష్కారం అవుతాయని కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు అన్నారు. స్థానిక మహిళ సంఘ భవనంలో రైస్ మిల్లు కార్మిక సంఘం సర్వసభ్య సమావేశం గుబ్బల సత్యనారాయణ అధ్యక్షతన గురువారం జరిగింది. ముందుగా కార్మిక సంఘ నాయకుడు పర్స సత్యనారాయణ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ ధరలు పెరుగుదల కారణంగానే కార్మికుల కూలీ రేట్లు పెంచాలని కోరుతున్నామని తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలంగా మార్చుతున్నారని విమర్శించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆచంట, జూన్ 13: విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. సురేష్ కుమార్ తెలిపారు. ఆచంట వేమవరం,కొడమంచిలి, కరుగోరుమిల్లి, కందరవల్లి, అయోధ్యలంక, పోడూరు మండలంలో వద్దిపర్రు గ్రామాల్లో సరపరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

నరసాపురం టౌన్: పట్టణ, మండలంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ సురేష్‌కుమార్ చెప్పారు. మండలంలోని సారవ, లక్ష్మణేశ్వరం, రాజుల్లంక, దర్భరేవు, రుస్తుంబాదా, బల్లకట్టు, పట్టణంలోని గాంధీబొమ్మ, కృష్ణబాబు కాలనీలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



భీమవరం టౌన్, జూన్ 13 : వాతావరణ మార్పులతో అనేక వ్యాధులు విజృంభిస్తున్నాయని, వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని దుర్గాపురం ప్రభుత్వ ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ జెరూషా అన్నారు. పట్టణంలోని దుర్గాపురం ఆరోగ్య కేంద్రం నుంచి సీజనల్ వ్యాధులు, జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డా క్టర్ జెరూషా మాట్లాడుతూ వర్షాకాలంలో ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉంటే దోమలు విజృంభిస్తాయని, తద్వారా అంతుపట్టని రోగాలతో సమాజం అనారోగ్యంగా ఉంటుందని అన్నారు. చెరుకువాడ రంగ సాయి, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, రోటరీ క్లబ్ సభ్యులు షేక్ బాబాజీ సాహెబ్ తదితరులు ర్యాలీ నిర్వహించారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుపై హర్షం

పాలకొల్లు టౌన్, జూన్ 13: ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుపై రెండవ సంతకం చేసి న్యాయవాదులకు ఇచ్చిన మాటను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిలబెట్టుకున్నారని పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల న్యాయవాదులు అన్నారు. ఈమేరకు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. గత ఏప్రిల్ నెలలో ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు పాలకొల్లు వచ్చిన సందర్భంలో న్యాయవాదులు ఆయన కలిసి భూహక్కు చట్టం వల్ల ప్రజలు, ప్రైవేటు ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందని ఈ చట్టాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేయాలని కోరారు.

క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలి

భీమవరంటౌన్, జూన్ 13 : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. భీమవరం ఏరియా ఆసుపత్రిలో క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహనలో భాగంగా భీమవరం ఏరియా ఆసుపత్రి, నరసాపురం ఏరియా ఆసుపత్రి, తణుకు జిల్లా ఆసుపత్రి తదితర చోట్ల మెడికల్ ఆఫీసర్లకు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు, ఏఎన్ఎంలకు శిక్షణ తరగతులు, మూడు రోజులపాటు ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్యాన్సర్ లక్షణాలు ఎలా ఉంటాయి. ఎక్కడ పరీక్షలు చేయించుకోవాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని అనేదానిపై వివరించాలన్నారు.

టైలరింగ్‌కు తగ్గుతున్న ఆదరణ

భీమవరం టౌన్, జూన్ 13 : దర్జీ వృత్తి (టైలరింగ్) అంటే ఆనాటి రోజుల్లో ఒక వెలుగు వెలిగిందని, ప్రస్తుతం రెడీమేడ్ వస్త్రాల వ్యవస్థ రావడంతో దర్జీ వృత్తి క్రమేణా మసకబారుతు వస్తోందని గాంధీ కస్తూరిబా ఆదర్శ మహిళ కేంద్రం కుట్టు మిషన్ శిక్షణ ఉపాధ్యాయులు దుర్గ రత్నమాల అన్నారు. గాంధీ కస్తూరిబా ఆదర్శ మహిళ కేంద్రంలో జాతీయ కుట్టు యంత్రం దినోత్సవాన్ని నిర్వహించి 8 మందిని సత్కరించారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దుర్గాబాయి దేశ్ ముఖ్ స్థాపించిన ఆదర్శ మహిళా సంఘాల్లో భీమవరం గాంధీ కస్తూరిబా ఆదర్శ మహిళ కేంద్రం ఒకటని, 15 ఏళ్లుగా కుట్టు మిషన్లు శిక్షణ అందిస్తున్నారని అన్నారు. ఈ కేంద్రంలో 42 మంది శిక్షణ పొందుతున్నారని అన్నారు.



భీమవరంలో తోట సీతారామలక్ష్మి, ఎమ్మెల్యేలు రఘురామ కృష్ణరాజు, అంజిబాబును కలిసిన మంత్రి నిమ్మల రామానాయుడు

మంత్రి నిమ్మలకు అభినందనలు

భీమవరం అర్బన్, జూన్ 13: మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు గురువారం టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిశారు. తోట సీతారామలక్ష్మి ఇంటి వద్దకు విచ్చేసిన మంత్రి నిమ్మలకు పార్టీ నాయకులు స్వాగతం పలికి సత్కరించారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, అంగన్వాడీ డ్వాక్రా సంఘాల ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ, పార్టీ నాయకులు కొల్లేపర శ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్, రేవు వెంకన్న, కౌరు పృథ్వీశంకర్, సయ్యద్ నసీమా బేగం, మాదాసు కనకదుర్గ, ఎండీ షబీనా, గంధం రాధా పాల్గొన్నారు.

కాళ్ల(ఉండి): తొలిసారిగా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తదుపరి కాళ్ల మండలం పెదఅమిరంలోని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణ రాజు నివాసానికి మంత్రి నిమ్మల రామానాయుడు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొత్తపల్లి నాగరాజు, ఆకివీడు, ఉండి మండల టీడీపీ అధ్యక్షులు కరిమెరక నాగరాజు, మోటుపల్లి రామవరప్రసాదు, ఉండి టీడీపీ అధ్యక్షుడు కాగిత బుజ్జి పాల్గొన్నారు.

భీమవరం టౌన్: రాష్ట్ర ప్రజలు చారిత్రాత్మక తీర్పునిచ్చారని, ప్రజల ఆశీస్సులతోనే తమ కూటమి విజయం సాధించిందని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. జనసేన ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) నివా సానికి చేరుకొని వారితో మాట్లాడారు. గత 5 ఏళ్లలో ఎంతో నష్టం జరిగిందని, రానున్న రోజులన్నీ మంచివేనని, మన జిల్లాకి మంచి పేరు తీసుకొని వస్తామని అన్నారు. అనంతరం మంత్రి నిమ్మల రామానాయుడును సత్కరించారు. అదే విధంగా జనసేన జిల్లా అధ్యక్షుడు కోటి కలపూడి గోవిందరావు నివాసానికి చేరుకొని వారిని మంత్రి కలిశారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, లంకి శ్రీనివాస్, పొత్తూరి బాపిరాజు పాల్గొన్నారు.

ఆకివీడు: భీమవరంలో ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణరాజు కార్యాలయానికి వచ్చిన రాష్ట్రమంత్రి నిమ్మల రామానాయుడుని ఆకివీడు టీడీపీ శ్రేణులు కలిసి అభినందించారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ఇంతటి ఘన విజయాన్ని అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలని మంత్రి అన్నారు. చంద్రబాబు నాల్గోవసారి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఒక అద్భుతమన్నారు. కార్యక్రమంలో గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

భీమవరం: భీమవరం వచ్చిన రాష్ట్ర మంత్రి పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడును సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి కలిసి సత్కరించారు. రాష్ట్రాభివృద్ధికి మంత్రి నిమ్మల పాత్ర ఎంతో ఉంటుందని, నాకు 18 ఏళ్లగా తెలుసని ఆయన ట్రస్టు ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు.

రహదారుల పక్కన చెత్త వేయవద్దు



వేంద్రలో చెత్తను తొలగించే పనులను పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ ఆంజనేయులు

పాలకోడేరు, జూన్ 13: రహదారుల వెంబడి చెత్త వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా పంచాయతీ అధికారులు, పాలకులు నడుంబిగించాలని ఈఓపీఆర్‌డీ ఎంఎస్ఆర్ ఆంజనేయులు సూచించారు. మండలంలోని వేంద్ర, మొగల్లు, వెళ్ళే ప్రధాన రహదారుల వెంబడి చెత్త పేరుకుపోవడంతో చెత్త తొలగించే విధంగా స్పెషల్ డ్రైవ్ గురువారం నిర్వహించారు. పనులను దగ్గరుండి ఆయన పర్యవేక్షించారు.

కేంద్ర మంత్రులకు అభినందన



తణుకు, జూన్13 : తేతలి గ్రామ టీడీపీ అధ్యక్షుడు అడ్డాడ శ్రీనివాసరాజు ఢిల్లీలోని కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, పెమ్మసాని చంద్ర శేఖర్, భూపతిరాజు శ్రీనివాస వర్మను కలిసి అభినందనలు తెలిపారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



నరసాపురం టౌన్, జూన్ 13: పట్టణంలోని నందమూరి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఫౌండేషన్ విద్యను పూర్తి చేసి ఒకటోవ తరగతిలో చేరే విద్యార్థులకు హెచ్ఎం జి.రామకిషోర్, టీచర్ వై.రాణి, వెంకటలక్ష్మి చేతలు మీదుగా పట్టాలందించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ డి.శైల, సూపర్‌వైజర్ విజయకుమారి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పులూరు కూటమి నాయకులకు సన్మానం

ఉండి, జూన్ 13: రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి విజయం, ఉండి ఎమ్మెల్యేగా కనుమూరు రఘురామకృష్ణరాజు, ఎంపీ అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాసవర్మలకు ఎన్నికలలో విజయంతో పాటు మంచి మెజార్టి రావడానికి ఉప్పులూరు గ్రామంలో కృషిచేసిన గ్రామ టీడీపీ కూటమి నాయకుల సేవలను గుర్తుంచుకోవాలని పలువురు నాయకులు అకాక్షించారు. గురువారం గ్రామంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు లోకం సుబ్బారావు, ఉపాధ్యక్షుడు లింగం నాగ వెంకట శేషగిరిరావు(రాజు), కార్యదర్శి వరసాల దాసన్న, మండల బీజేపీ అధ్యక్షుడు యర్రా విక్రమ్‌లకు ఘనసన్మానం చేశారు.

మోదీని కలిసిన బీజేపీ నేత కబర్డీ



పాలకొల్లు టౌన్, జూన్ 13: గన్నవరం విమానాశ్రయంలో భారత ప్రధాని నరేంద్రమోదీని పాలకొల్లు బీజేపీ నేత, కృష్ణాజిల్లా బీజేపీ ఇన్‌చార్జి ఉన్నమట్ల కబర్డీ మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా కబర్డీ విలేకరులతో మాట్లాడుతూ విమానాశ్రయంలో నరేంద్రమోదీని కలుసుకుని మాట్లాడేందుకు బీజేపీ, టీడీపీ, జనసేన ముఖ్యనేతల బృందంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తనను నియమించారన్నారు. దీంతో ప్రధాని నరేంద్రమోదీని పరిచయం చేసుకుని మాట్లాడే అవకాశం దక్కిందన్నారు. ఈమేరకు పురందేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారోత్సవంలో నరేంద్రమోదీ ముఖ్యఅతిథిగా పాల్గొని తిరిగి వెళ్లే సమయంలో ఆయనతో ఆంగ్లంలో మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రజా ఆశీర్వాదంతో మూడవసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించినందుకు శుభాకాంక్షలు తెలియజేసినట్లు తెలిపారు.

కాపు వనిత సర్వీస్ క్లబ్ దత్తత

పాలకొల్లు అర్బన్, జూన్ 13 : హౌసింగ్ బోర్డుకాలనీకి చెందిన పేద విద్యార్థి యాగ శ్రీరామ్ కార్తీక్‌ను యునైటెడ్ కాపు వనిత సర్వీస్ క్లబ్ చదువు నిమిత్తం దత్తత తీసుకున్నది. యాగ షైనర్ బాబు, ఉదయ దుర్గ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉండగా ఇటీవల షైనర్‌బాబు మరణించడంతో దిక్కు లేని స్థితిలో ఉదయ దుర్గ పిల్లలతో ఉంది. విషయం తెలుసుకున్న వనిత క్లబ్ పెద్దవాడైన యాగ శ్రీరామ్ కార్తీక్‌ను గురువారం ఉల్లంపర్రు మాంటిస్సోరీ స్కూల్లో 4వ తరగతిలో చేర్పించారు. ఈవిద్యార్థి చదువులకు అయ్యే మొత్తం తమ క్లబ్ భరిస్తుందని, రానున్నకాలంలో క్లబ్ సభ్యురాలు తోట వెంకట అనంత లక్ష్మీ ఈస్కూల్లో చదివినంత వరకూ రూ. లక్షరూపాయలు అందించి విద్య కొనసాగించే విధంగా చూస్తున్నామని ప్రెసిడెంట్ అరుణ తెలిపారు.

డీఎన్నార్ అధ్యాపకుడికి డాక్టరేట్



భీమవరం ఎడ్యుకేషన్, జూన్ 13 :డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డాక్టర్ కె.వేణుగోపాల్‌కు ఆంధ్రా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.యం అంజన్‌కుమార్ తెలిపారు. డాక్టర్ వేణుగోపాల్ డిజైన్ అండ్ ఎనాలసీస్ ఆఫ్ మ్యూచువల్ కంప్లింగ్ రిడక్షన్ ఇన్ షైమో యాంటెన్నాస్ అనే అంశంపై పరిశోధనలకుగాను డాక్టరేట్ ప్రధానం చేశారని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణుగోపాల్‌ను కళాశాల అధ్యక్షకార్యదర్శులు గోకరాజు నరసింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) తదితరులు అభినందించారు.

వైభవంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



పెంటపాడు, జూన్ 13 : ఆకుతీగపాడులో ముత్యాలమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు, సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ బుద్దన ధనరాజు, కొల్లూరి పండు, ఎంపీటీసీ కొణతల వెంకట్రావు, కొల్లూరి నాగరాజు, బుద్దన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి వర్మను కలసిన వలవల

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 13 : కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి గురువారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. కిలపర్తి వెంకట్రావు, పరిమి రవికుమార్, పోతుల అన్నవరం, సుబ్బరాజు పాల్గొన్నారు.

ప్రజా విజయాన్ని బాధ్యతగా తీసుకుంటాం

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 13 : ప్రజలు అందించిన భారీ విజయాన్ని బాధ్యతగా తీసుకుంటా మని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. తాడేపల్లిగూడె ంలో టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను గురువారం టీడీపీ, జనసేన కార్యాలయాల వద్ద మంత్రి కలిశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడిని శాలువా, పుష్ప గుచ్ఛాలతో సత్కరించారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత జిల్లాలోని నాయకులందరిని మర్యాదపూర్వకంగా కలవాలనే ఉద్దేశంతో వచ్చినట్లు తెలిపారు. బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ అందజేత

తణుకు, జూన్ 13: మానవత సభ్యురాలు అయిన వంగూరి హనుమంతరావు భార్య సుశీల జన్మదినోత్సవం సందర్భంగా వేల్పూరు గ్రామానికి చెందిన షేక్ అస్కరి జహల్ అనే మహిళలకు రూ.11 వేల విలువ చేసే కుట్టు మిషన్ అందజేశారు. కార్యక్రమంలో మానవత శాంతి ర్యాలీ జిల్లా ఛైర్మెన్ గమిని రాంబాబు, ఎస్వీ సతీష్‌బాబు, శారదాదేవి, శివనారాయణ, పాల్గొన్నారు.

విజయ గణపతికి లక్ష గరికపూజ



భీమవరం టౌన్, జూన్ 13 : అంబేద్కర్ సెంటర్‌లోని శ్రీ విజయ గణపతి స్వామి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో రుద్రాభిషేకాలు, లక్ష గరిక పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ది భీమవరం టాక్సీ ఓనర్స్‌వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగి భగవాన్ నారాయణ, పంపన కృష్ణ, మోటుపల్లి వెంకట రత్నం, మిడత మధు, దొంగ వెంకన్న, వీరవల్లి అజయ్, శ్రీను (బుట్టు), శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల జాతర



అమ్మవారిని తీసుకువస్తున్న దృశ్యం

పెనుమంట్ర,జూన్ 13 : పొలమూరు గ్రామ దేవత పోలేరమ్మ, మహంకాళి అమ్మవార్ల జాతరలో భాగంగా గురువారం వైభవంగా అమ్మవారిని నడివీధి నుంచి ఆలయానికి మేళతాళాలు, బాణసంచాకాల్పుల మధ్య భక్తులు అమ్మవారిని ఆలయంలోకి ప్రవేశింపజేశారు. ఈనెల 1వ తేదీన జాతర సందర్భంగా అమ్మవారిని ఆలయం నుంచి నడివీధిలోని పూరి గుడిసె వద్దకు తీసుకు వచ్చి జాతర నిర్వహించారు.

శంకర మఠంలో రుద్రయాగం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 13: తాడేపల్లిగూడెం శంకరమఠంలో గురువారం శ్రీఉమాచంద్రమౌళేశ్వర స్వామి, శ్రీసర్వమంగళ అమ్మవారి ఆలయం వద్ద గురువారం రుద్రయాగం నిర్వహించారు. జగద్గురూ శ్రీ ఆదిశంకరాచార్యస్వామికి విశేష అర్చనలు, పవిత్రోత్సవాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మందాలమ్మకు ముత్యాల హారం



పెనుగొండ, జూన్ 13: వడలి గ్రామ దేవత మందాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధిలో భాగంగా గురువారం అమ్మవారికి సిల్వర్ ముత్యాల హారం బహూకరించారు. రేణుకా తన్మయి కుటుంబ సభ్యులు 128 గ్రాముల హారం అందించారు.

అపుస్మా నూతన కార్యవర్గం



పాలకొల్లు రూరల్, జూన్ 13 : ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) పాలకొల్లు జోన్ కార్యవర్గ ఎన్నిక గురువారం జరిగింది. స్థానిక దీప్తి స్కూల్లో జరిగిన కార్యక్రమంలో జోన్ ఛైర్మన్‌గా గొర్ల శ్రీనివాస్, కార్యదర్శిగా మానేపల్లి శ్రీరామ్, కోశాధికారిగా అందే భాను ప్రకాష్, ఉపాధ్యక్షులుగా వి.సాయిబాబు, అడబాల శ్రీమన్నారాయణ, సంయుక్త కార్యదర్శులుగా మేడపాటి జానకిరామ్, మోదిన పద్మిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆదరణ లేని వృద్ధురాలికి అంత్య క్రియలు

పాలకొల్లు రూరల్, జూన్ 13 : స్థానిక విశ్వ మానవ వేదిక వృద్ధుల ఆశ్రమంలో ఉంటున్న సానబోయిన భవాని (70) మరణించడంతో ఆమెకు బంధువులు లేని స్థితిలో వృద్ధాశ్రమం నిర్వాహకుడు మల్లుల సురేష్ గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో విశ్వమానవ వేదిక సభ్యులు గుంపుల రవి, డాక్టర్ మల్లుల జ్ఞానేశ్వరి, కోళ్ళ సింహాద్రి, ఎం గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేత

పాలకొల్లు అర్బన్, జూన్ 13 : స్థానిక వీవర్స్ కాలనీలోని మునిసిపల్ ఎలిమెంట్రీ పాఠశాల విద్యార్థులకు పానకాల రాయరామమోహన్ క్లబ్ ఆధ్వర్యంలో నోట్ పుస్తలు, విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శర్మ, హెచ్ఎం అర్ భవానీ ప్రసాద్, క్లబ్ అధ్యక్షుడు గాదె వీర వెంటక సత్యనారాయణ, కార్యదర్శి మామిడి బాబు, కోశాధికారి చోడిశెట్టి జ్ఞానశంకర్, ఎమ్మెస్ కోఆర్డినేటర్ పి జనార్దన్ పాల్గొన్నారు.